ప్రమాదకరంగా ఆర్ అండ్ బి రోడ్డు
పట్టించుకునే వారేరి...?

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ఇటీవల శబరి గోదారి నదుల వరదలు వచ్చి రెండు నెలలు గడిచిన వరద వలన ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చక పోవడం వలన ప్రమాదకరంగా రహదారి ఉన్నందున వాహనాలు దారులకు బాటసారులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆదమరిస్తే గోతుల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతాయని, సంభందిత శాఖ అధికారులు పట్టీ పట్టనట్లుగావ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈ ప్రధాన రహదారి పై నిత్యం పాపికొండల పర్యాటకులు, పంట పొలాల రైతులు, విద్యార్థులు స్కూల్ కి వెళ్ళే రహదారి అయినందున మండలం లోని రావాలంటే ఈ రహదారి గుండా మాత్రమే రావాల్సి ఉందని మరో దారి లేదని ఇటువంటి పరిస్థితీ నెలకొన్న నేపథ్యంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులు మాత్రం ఎక్కడా కానరావడం లేదనీ. ఇప్పటికైనా సంభందిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని రోడ్లపై ఉన్న గోతులు, వరద కోతకు గురైనపాడవాటి కన్నాలు పూ డ్చాలనిమండల ప్రజలు, వాహనదారులు రైతులు కోరుతున్నారు.

రాజ్మా చిక్కుళ్ళ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-జీకే వీధి: గూడెం కొత్త వీధి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎంపీపీ బోయని కుమారి, సర్పంచ్ సుభద్ర,, ముక్కలి రమేష్, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్‌రావు, ఎస్సై అప్పలసూరి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో రాజ్మా చిక్కుళ్ళు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీపై రాజ్మా విత్తనాలు రైతులకు పంపిణీ జరుగుతుందని మండలంలో ప్రతి రైతు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,కూటమి నాయకులు, ప్రజలు, అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

171 మందికి కంటి పరీక్షలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండల కేంద్రంలోని దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ ఆర్ ఎ సి ఎ రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కే కృష్ణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ పట్నం ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది కంటి వ్యాధిగ్రస్తులకు పరీక్షల నిర్వహించి వైద్య సేవలు అందించారు. 171 మంది కంటి వ్యాధి గ్రస్తులు శిబిరంలో పాల్గొనగా వారికి ప్రత్యేక కంటే వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 36 మందికి కంటికి సంబంధించి సమస్య ఉండగా, మరో 39 మందికి కళ్లద్దాలు అవసరం తో పాటు మిగిలిన వారికి సాధారణ సమస్యలు ఉన్నట్లు నిర్ధరించడం జరిగిందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య వైద్య సిబ్బంది, వైద్యాధికారి రాంబాబు, సంతోష్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న మురుగు కాలువలు

- కాలువలపైనే దర్జాగా వ్యాపారాలు.....
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజానికం....
- రోడ్లపైకే మురుగునీరు, చెత్తాచెదారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

విశాలాంధ్ర-పాడేరు : పాడేరు మేజర్ పంచాయతీ అయినప్పటికీ ఇప్పుడు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం అయినా కుడా పంచాయితీ అధికారులు పారిశుద్యంపైన మురుగు కాలువలపైన శ్రద్ధ చూపకపోవడంతో మురుగు కాలువలు మొత్తం ఆక్రమణకు గురౌతున్నాయి. కొంతమంది వ్యాపారస్తులు ఈ మురుగు కాల్వలను ఆక్రమించి వాటిపై షెడ్లు నిర్మించి మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా దర్జాగా వ్యాపారం చేసి లాభాలు గణిస్తున్నారు. కానీ సామాన్య ప్రజలు, వాహనదారులు దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు మాత్రం వర్షం వచ్చినప్పుడు ఈ మురుగు కాల్వల నీరు మొత్తం రోడ్లపై రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనివలన వర్షం వచ్చినప్పుడు పాడేరులో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రతరమవుతుంది. దీనికి ఉదాహరణ మొన్న పడిన వర్షాలకు పాడేరు పట్టణమంతా ఎక్కడికక్కడ మురుగునీరు స్తంభించిపోయి మురుగు చెత్తాచెదరం రోడ్లపై ప్రవహించి లోతట్టు ప్రాంతంలో ఉన్న గృహాల్లోకి కూడా చెత్తాచెదరం చేరిన పరిస్థితి నెలకొంది. దీనికి కారణం కేవలం పంచాయితీ అధికారుల నిర్లక్ష్యమే..! ప్రజల బాగోగులు పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి వ్యాపారస్తులకు కొమ్ము కాయడంతో పాడేరులో డ్రైనేజీలు ఆక్రమణకు గురై ఇలాంటి పరిస్థితులు దాపరిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి మురుగు కాలువ లపై ఆక్రమణలు తొలగించి మురుగు కాలువల వ్యవస్థని క్రమబద్ధికరిస్తే వర్షం పడినప్పుడు ఈ మురుగు కాలువల చెత్తాచెదరం రోడ్ల పైకి, దిగువ ఉన్న గృహాల్లోకి, పంట పొలాల్లోకి, రాకుండా నిలువరించవచ్చునని ప్రజలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నాయి. పాడేరు జిల్లా కేంద్రం అయినందువలన అల్లూరి కలెక్టర్, దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, స్పందించి మురుగు కాలువల విషయం పైన త్వరితగతినే చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించి మురుగు కాలువల వ్యవస్థని పునరుద్ధరించాలని పాడేరు ప్రజలతో పాటు జిల్లా వాసులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన లక్ష్మణ్‌కు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చింతపల్లి : ఆసుపత్రిలో షార్ట్ సర్క్యూట్ అయిన ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యుత్ సహాయకుడు గుల్లెల లక్ష్మణ్ మరింత మెరుగైన వైద్య సేవలు పొంది త్వరగా కోలుకోవాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఆసుపత్రి సూపరిండెండెంట్ ప్రభావతి అన్నారు. ఈ నెల 26న చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో విద్యుత్ మరమత్తు పనులు నిర్వహిస్తున్న విద్యుత్ సహాయకుడు గుల్లెల లక్ష్మణ్ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ కాళ్లు, ముఖం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్సను అందించారు. మెరుగైన వైద్యం కొరకు మంగళవారం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత రూ. 5 వేలు, ఆసుపత్రి సూప రింటెండెంట్ ప్రభావతి ఆసుపత్రి నిధుల నుంచి మరో రూ.5 వేలు, ఆమె సొంత నిధులు రూ.2 వేలు మొత్తం రూ.12 వేలు ఆర్థిక సహాయంగా అందించి మరింత మెరుగైన వైద్యం కోసం విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్ కు ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, లక్ష్మణ్ సోదరి కాగి వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై 29న రీలే నిరాహార దీక్ష

ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి నాయకులు

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ గిరిజన, సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న పాడేరులో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్టు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ విలేకరుల సమావేశంలో తెలియజేసారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు పెండింగ్లో ఉన్నటువంటి మెస్, కాస్మోటిక్, ట్రాంకు పెట్టెలు, ఖాళీగా ఉన్న కుక్, కామాటీ, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు, హాస్టల్ కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు.అదేవిధంగా జిల్లాలో కూడా 29వ తేది రిలే నిరసన దీక్షను చేపతున్నమన్నారు. ప్రతి గిరిజన హాస్టల్స్‌లో మెడికల్ సిబ్బందిని నియమించి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం హాస్టల్లో చదువుతున్నటు వంటి విద్యార్థులకు రోజుకి 33 రూపాయలు మాత్రమే ఇస్తున్నరన్నారు. మళ్లీ ఈరోజు అన్న క్యాంటీన్లో ఒక వ్యక్తికి రోజుకి 90 రూపాయలు ఖర్చు పెడుతోంది ప్రభుత్వం అన్నారు. మరి అదే విధంగా జైల్లో ఉన్నటువంటి ఖైదీకి ఒక రోజుకు 75 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు.దేశానికి దశాదిశా చూపే విద్యార్థులపై రాష్ట్రప్రభుత్వం సవతి ప్రేమ చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. అదేవిధంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. శిదిల వ్యవస్థ లో ఉన్నా భవనాలు కూల్చి నూతన భవనాలు నిర్మించాలన్నారు. పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో నోట్‌బుక్స్ సరఫరా చేయాలన్నారు. విద్యార్థులకు సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణరావు, పి. చిన్నాబాబు. జి.తనీష్, ఈశ్వర్, మల్లేష్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జనమన్ అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-జీకే విధి : మండలంలోని దేవరపల్లి పంచాయతీ, సాగులు పీవీటీజీ గ్రామంలో పీఎం జన్‌మన్ అవగాహన కార్యక్రమం, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ సాగులు పీవిటిజి గ్రామంలో బాల ఆధార్ కార్డులు అప్డేట్ చేశారు గాని ఆధార్ కార్డులు రాలేదన్నారు. రైతులకు ఆర్ఓ ఎఫ్ ఆర్ పట్టాలు పంపిణీ జరిగిందన్నారు .పీఎం జనమన్ సంబంధించిన బ్యాంకు ఖాతాలు తెరిచారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ ఎం జన్ మన్ కార్యక్రమం ద్వారా పివిటిజి గ్రామాలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైస్ సర్పంచ్ గుమ్మడి రాజు మాట్లాడుతూ పంచాయతీ పరిధి లో పివిటిజి గ్రామంలో పలు సమస్యలపై మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిమల బుజ్జిబాబు, వైస్ సర్పంచ్ గుమ్మడి రాజు, పంచాయతీ డిడిఓ బాలకృష్ణ సచివాలయం సిబ్బంది స్థానిక ప్రజలు హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే శిరీషదేవి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : మంగళవారం రాజవొమ్మంగి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయంమని,మన ప్రాంతంలో నాకు అందరూ సమానమేనని తెలిపారు, ముందుగా మండలంలోని కిర్రాబు గ్రామంలో దుర్గమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించి,లబ్బర్తి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండలం లబ్బర్తి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించిన, జ్ఞాపికను అందజేశారు. రాజవొమ్మంగిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని తీరుని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి పార్టీ శ్రేణులు, జనసేన అధ్యక్షుడు బోదిరెడ్డి త్రిమూర్తులు, బిజెపి అధ్యక్షుడు తాము సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నిధులతో డ్రైనేజీ పనులు మొదలు

విశాలాంధ్ర-అనంతగిరి : టోకూరు పంచాయతీ కేంద్రంలో దశాబ్దాలుగా మురికి కాలువతో ఇబ్బందులు పడుతున్న టోకూరు ప్రజలకు అనంతగిరి జడ్పీటీసీ సహకారంతో మంచి రోజులు. జిల్లా పరిషత్ నిధులు 7.50 లక్షల రూపాయల తో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన డ్రైనేజీ పనులు ప్రారంభం. మంగళవారం టోకూరు పంచాయతీ కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల కి ఆనుకుని ఉన్న మురికి కాలువ పనులు అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య గారు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నా దృష్టికి తీసుకొచ్చారని జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర మేడమ్ గారు తో మాట్లాడి నిధులు మంజూరు చెయ్యడం జరిగిందని తెలిపారు అంతేకాకుండా ఇదివరకు ఎన్నడూ లేని విధంగా చైర్మన్ మేడమ్ గారు సహకారంతో మన మండలని నిధులు తీసుకొని రావడం జరుగుతుందని ఆయన అన్నారు విడుతలు వారిగా అని పంచాయతీలకు నిధులు మంజూరు కేటాయిస్తామని తెలిపారు స్థానిక సర్పంచ్ కిల్లో మోస్య ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న మాజీ సర్పంచ్ సారా దొన్ను మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న మురికి కాలువకి నిధులు మంజూరు చేసిన జెడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు గారు కి ధన్యవాదాలు మా పంచాయతీ కి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు పూజారి లక్ష్మణ్ సీపీఎం నాయకులు గెమ్మెల దేవన్న భీమరాజు టీడీపీ నాయకులు సమర్ది దొన్ను గ్రామస్తులు కిల్లో లక్ష్మీ నాయుడు నరాజి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

18 వందల ఎకరాలలో జీడితోటల పునరుద్ధరణ కార్యక్రమం : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో 18 వందల ఎకరాల్లో జీడి తోటల పునరుద్దరణ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వివిధ శాఖలతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన, సెరికల్చర్, సూక్ష్మ సేద్యం రంగాల్లో ప్రభుత్వ పరంగా రైతులకు ఉపయోగపడే మంచి పథకాలు ఉన్నాయన్నారు. పథకాలను రైతులు వద్దకు తీసుకువెళ్లాలని ఆయన ఆదే శించారు. జిల్లాలో తక్కువ ఫలసాయం వస్తున్న జీడి మామిడి తోటల పునరుద్దరణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఎండిపోయిన, పురుగు పట్టిన జీడీ కొమ్మలను కత్తిరించడం వంటి పద్ధతులను తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్న గిరిజన మండలాలలో జీడీ మామిడి తోటల్లో చెట్ల దిగుబడి తగ్గిపోయిందని, ఐటీడీఎ- ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల ఎకరాల్లో ఉన్న జీడీ మామిడి తోటలోని కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. అవసరం మేరకు ఉపాధి హామీ పథకం అనుసంధా నంతో రైతులకు మేలు జరిగే కార్యక్రమం చేపట్టాలని స్పష్టం చేశారు. తోటలోని కొమ్మలను తొలగించడం వల్ల సూర్యరశ్మి చెట్లకు తాకడం వల్ల అధిక దిగుబడి ఉంటుందని అన్నారు. చెట్లను గొడుగు ఆకారంలో కొమ్మలను తొలగించడం వల్ల చెట్ల మధ్యలో ఖాళీ ఏర్పడి చెట్టుకు చీడపీడ సోకే అవకాశం ఉండదని చెప్పారు. నేల నుండి మీటర్ ఎత్తులో ఉన్న కొమ్మలను కత్తిరించాలని సూచించారు. చెట్టు కొమ్మలకు పురుగుపడితే ఆ కొమ్మలను పూర్తిగా కత్తిరించాలని తెలిపారు. అస్తవ్యస్తంగా చెట్టు చెట్టుకి ఆనుకుని ఉన్న కొమ్మలను కత్తిరించి సూర్యరశ్మి తోట అంతటా సోకెలా చర్యలు తీసుకోవాలన్నారు. కొమ్మలను కత్తిరించాక బోర్డో పేస్ట్‌ను పూతగా పూయాలన్నారు. వాటికి అవసరమైన పనిముట్లును నూరు శాతం రాయితీపై ఐటీడీఎ పార్వతీపురం కూలి ఖర్చు ఇవ్వడం జరుగుతుందన్నారు. పునరుద్దరణలో భాగంగా జి.ఎల్ పురంలో 500 ఎకరాలు, కురుపాంలో 540, జి.యం.వలసలో 200, కొమరాడలో 160, సాలూరులో 200, మక్కువలో 100, పార్వతీపురంలో 100 ఎకరాల్లో జీడీ మామిడి పునరుద్దరణ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు రైతులు దగ్గరలో ఉన్న ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పని వేళల్లో సంప్రదించవచ్చని లేదా ఐటీడీఏ ఉద్యానశాఖ ఏఇఓ సుబ్బరాజు (9492745405)ను సంప్రదించా లన్నారు. ఈ సమావేశంలో ఉద్యాన, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై తుంపర సేద్యం పరికరాలు సరఫరా

విశాలాంధ్ర-పార్వతీపురం : తక్కువ నీటివసరులతో వ్యవసాయం చేయుటకు తుంపర సేద్యం పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఐ.టి.డి.ఎ. పార్వతీపురం వారి పరిధిలో గల గిరిజన సబ్ ప్లాన్ మండలాలలో రైతులకు తుంపర సేద్యం 2024-25 సంవత్సరానికి గాను రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఐ.టి.డి.ఎ. పరిధిలో 750 మందికి గాను 53.79 లక్షలు నిధులు విడుదల చేయడం జరిగిందని, ప్రతి రైతుకు ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తరుపున చిన్న, సన్నకార రైతులకు (5 ఎకరాలు లోపు) 55% రాయితీ మరియు పెద్ద రైతులకు (5 ఎకరాలు నుండి 12.5 ఎకరాలు వరకు) 45% రాయితి ఇప్పటికే అందచేయటం జరుగుతుందని, దీనికి అదనముగా ప్రతి గిరిజన రైతుకి రూ.7172/- ఐ.టి.డి.ఎ. తరుపున రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాయితీ పొందుటకు ప్రతి రైతుకు ఒక ఎకరా తక్కువ కాకుండా భూమి, బోర్ బావి, ఆయిల్ ఇంజెన్, సోలార్ పంప్ ఉన్న గిరిజన రైతులు ఈపథకంకు అర్హులనిచ ఈ యొక్క అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేసారు. పథకం పొందదలిచిన గిరిజన రైతులు మీ సమీప రైతు సేవ కేంద్రం లో సంప్రదించాలని లేదా 7995009841(కేశవ్, స్ప్రింకర్స్ ఇంజనీరు) నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈపథకం క్రింద దరఖాస్తు చేసుకొనుటకు అవసరమైన పత్రాలు ఆధార్‌కార్డు, 1 బి, రైతు బ్యాంకు అకౌంట్, రైతు గుర్తింపు కార్డు (ఆధార్ కాకుండా), రైతు ఫోన్ నెంబర్ అందజేయాలని తెలిపారు.

ఆశాజ్యోతి ఆశ్రమాన్ని జిల్లా కోర్టు లోక్ అదాలత్ సభ్యులు సందర్శన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం జిల్లా కోర్టు లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు తదితరులు మంగళవారం పార్వతీపురం పట్టణ శివారులో ఉన్న ఆశాజ్యోతి ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రేషన్ కార్డు, ఆధార్ కార్డులు ఉన్నాయా లేవా అలాగే వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే అంబేద్కర్, వివేకానంద, మహాత్మా గాంధీ, అబ్దుల్ కలామ్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని, ఉత్తమ మార్గంలో పయనించాలంటే చెడ్డ వారికి దూరంగా ఉండాలని, విద్యార్థి దశ నుండే ఇష్టపడి కష్టపడితే భావితరాల వారికి ఆదర్శప్రాయులుగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం. వెంకటరమణ, బి. పర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిడి కార్యాలయాన్ని సీతంపేటలో కొనసాగించాలి

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకి జేఏసీ వినతి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏలోని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కొనసాగించాలని ఆదివాసి జేఏసీ నాయకులు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ కు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు నిర్వహించబడుతున్నాయని, తెలిపారు. గిరిజన సంక్షేమ ఉద్యోగులు విధులకు అనుగుణంగాఐటీడీఏ లో ఐఏఎస్ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో డిడి కార్యాలయం ఉండడం వలన పాలన సౌలభ్యం ఉంటుందని అందువలన డిడి కార్యాలయం సీతంపేట ఐటిడిఏ లో కొనసాగించాలని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రామ్మోహన్, రమేష్, వినోద్, తిరుమల, ప్రసాద్, గోపి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఫీజులు రద్దు చేయాలి

విశాలాంధ్ర-బెలగాం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థుల నుండి వసూలు చేస్తున్న స్పెషల్ ఫీజులు రద్దు చేయాలని 'సామాజిక చైతన్య వేదిక' ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వివిధ అంశాల పేరు చెప్పి పేద విద్యార్థులనుండి 2,250/- రూపాయలు వసూలు చేయడం చాలా అన్యాయమని, తక్షణమే ఈ స్పెషల్ ఫీజుల విధానం రద్దు చేయాలని రంజిత్ కుమార్ కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివేవారందరూ పేద విద్యార్థులేనని అన్నారు.

చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లాలో చేపల చెరువులకు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మత్స్యశాఖ జిల్లా అధికారి పి.తిరుపతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల చెరువులు తీసుకునే వ్యాపారస్తులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2020 ప్రకారం లైసెన్స్ ల మంజురు జరుగుతుందని ఆయన చెప్పారు. ఇ-మత్స్యకార్ లాగిన్‌లో గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. దరఖాస్తుతో పాటు ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున చెల్లించాలని, మండల సర్వేయర్ జారీ చేసిన ఆటోక్యాడ్ మ్యాపు, భూమి రెవెన్యూ అడంగల్, పట్టాదారు పాసుబుక్ లేదా లీజ్ అగ్రిమెంటు, పది రూపాయల బాండ్ పేపర్ పై 80 శాతం నిఖర చెరువు, 20శాతం గట్లు వేస్తానని హామీ ఇస్తూ అఫిడవిట్ ఉండాలని వివరించారు. అర్హత గల దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ద్వారా లైసెన్స్‌ల మంజూరు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

ఎస్ఐ షణ్ముఖరావుకు విఆర్‌కు బదిలీ

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం ఎస్ఐ ఎస్.షణ్ముఖరావుకు విఆర్‌కు బదిలీ చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల జరిగిన ఎస్ఐలో బదిలీలో షణ్ముఖరావు కురుపాంలో ఉంటారని అంతా భావించారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు గుమ్మలక్ష్మి పురం నుంచి బదిలీపై వచ్చారు. కురుపాం ఎస్ఐగా ఎవరు నియమితులౌతారో వేచి చూడాల్సిందే.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో గల పలు పాఠశాల లను ఏటిడబ్ల్యూఓ చంద్రబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మంగళవారం ఉదయం జియ్యమ్మ వలస పంచాయితీలోని బొడ్డవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆపాఠశాలలో ఏకోపాధ్యాయునిగా పనిచేస్తున్న అంకలాపు భాస్కరరాయుడు విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మందలించడం జరిగింది.పరిస్థితిని మార్చుకోకపోతే కచ్చితంగా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు తరువాత గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈరెండుపాఠశాలలో విద్యాబోధన, మెనూ అమలుతీరును, రికార్డుల పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈరెండుఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయులు ఏ రవిప్రసాద్, ధనుంజయనాయుడులు ఏటిడబ్ల్యూ దృష్టికి తీసుకొని వచ్చారు. దీనిపై స్పందించిన ఆయన విషయాన్ని ఆయన డిడి దృష్టికి తీసుకువెళ్లి త్వరలో ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఐటీడీఏలో రన్నింగ్ పోటీలకు ఆహ్వానం

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏలో ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 3 కిలోమీటర్లు, 2 కిలోమీటర్లు రన్నింగ్ పోటీలకు పాలకొండ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఐటిడిఏ పీవో వి.వి.రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటలకు ఐటిడిఎలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించబడును.ఈ పోటీలకు పాలకొండ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లోని 10వ తరగతిలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయబడును. పోటీల అనంతరం ఐటిడిఏ మీటింగ్ హాల్లో జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన వారు 29వ తేది ఉదయం 6 గంటలకు ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంకు హాజరుకావాలని పీవో తెలిపారు.

ఇసుక తవ్వకాలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో భామిని మండలం కాట్రగడ్డ వద్దగల ఇసుక ర్యాంపులో అందుబాటులోగల ఇసుకను గురువారం నుండి వెలికితీయుటకు ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇసుక తవ్వకం నీటిపారుదల శాఖ అధికారులు చేపట్టాలని, వాహనాలు రవాణాశాఖ అధికారులు చేపట్టాలని, సేకరించిన ఇసుకను స్టాకు పాయింటులో నిల్వచేయాలని తెలిపారు. ఇసుక సేకరించిన అనంతరం అమ్మకాలకు సంబంధించి ఇతర శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులకు సిబ్బందిని వెంటనే కేటాయించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఇసుక బుకింగు పాయింటు వద్ద ఇసుక అమ్మకాలను గుర్చిరేట్ల వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని, పోస్టర్లు అంటించాలని తెలిపారు. ఇసుక బుకింగు ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా చేసుకోవాలని, ప్రజలకు అవగాహన కొరకు ప్రచారం చేయాలని తెలిపారు. ఇసుక అమ్మకాలలో ప్రభుత్వం నిర్దేశించిన రుసుములు తప్ప ఎటువంటి అదనపు వసూల్లు చేయకూడదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. స్టాకు పాయింటు వద్ద సిసి కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఇసుక అక్రమ రవాణాచేస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొమరాడ, సీతానగరం మండలాలలో ఇసుక అక్రమ రవాణాపై పిర్యాదులు, వార్తలు వస్తున్నాయని అటువంటివారిపై పోలీసు, రెవిన్యూ శాఖల అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవలసినదిగా రెవిన్యూ డివిజినల్ అధికారి కె.హేమలతను ఆదేశించారు. ఈసమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్.ఎస్.శోబిక, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, ఎ.ఎస్.పి. ఒ. దిలీప్ కిరణ్, వి.వి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ, వంశధార ఇఇ రామచంద్రరావు, డిటిఒ ఎం.శశికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చిన యువత

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామం పైసెంటర్ నందు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ మంగళవారం కొంతమంది గిరిజన యువకులు శుభ్రంచేసి వినియోగానికి తీసుకురావడం జరిగింది. గత కొంతకాలంగా పశువులు స్థావరంగా ఏర్పరచుకొని బస్టాండును చెత్తాచెదారంతో కూడుకొని ఉండటంతో చలించిన కొంతమంది యువకులు టిఎస్ఎస్ ఎఫ్ రాష్ట్ర నాయకులు దూడ ప్రణీత్, ఆటో యూనియన్ నాయకులు సూర్యనారాయణ కలిసి కాంప్లెక్స్ ను శుభ్రం చేసి వినియోగానికి తీసుకురావడం జరిగింది. వీరు చేసిన పనిని గ్రామస్తులు ప్రజలు అభినందించడం జరిగింది. ఇటువంటి ప్రభుత్వ భవనాలను ఖాళీగా ఉంటే కొంతమంది ఇష్టానుసారంగా తమ సొంత అవసరాలకు నియగుంచుకోవడం జరుగుతుందని ఇటువంటి కబ్జాలు జరగకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా ఈ పని చేశామని దూడ ప్రణీత్ సూర్యనారాయణ చెప్పడం జరిగింది.

గ్రామస్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారుచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : గ్రామాలను అభివృద్ధి బాట పట్టించుటకు గ్రామ స్థాయి సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎం.పి.డి.ఓ)ను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు జిల్లా కలెక్టర్ మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి అభివృద్ధి పనులు చేయడంలో సరైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని స్పష్టం చేశారు. సానుకూల దృక్పథంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. లక్ష్య సాధన దిశగా పనితీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని సూచించారు. ఆరోగ్యం మెరుగు పరచడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగు నీరు అందించడం వంటి అంశాలు కూడా అభివృద్ధిలో భాగమన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. స్పష్టమైన లక్ష్యాలను వారికి నిర్దేశించాలని అన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు ఎక్కడా జరగరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎం.పి.డి.ఓలు కూడా పర్యవేక్షణ చేయాలని ముఖ్యంగా తాగు నీటి వసతులు, మౌలిక వసతులు ఉన్న ప్రదేశాలు వద్ద నిర్దేశిత నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగరాదని అన్నారు. సెప్టెంబరు 15 నాటికి వర్మి కంపోస్టు కేంద్రాల నుండి ఉత్పాదకత ఉండాలని ఆయన ఆదేశించారు. దోమలు, వ్యాధులు వ్యాప్తి కాకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, సరైన పర్యవేక్షణ చేయాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు వార్డుల వారీగా అవగాహన కల్పించాలని, కమిటీలను నియమించాలన్నారు.

జన్ మాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి : ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద ఆదివాసీ గిరిజనుల (పి.వి.టి.జి) సర్వతోముఖ అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన సూచించారు. పి.వి.టి.జిలకు పూర్తి స్థాయిలో పక్కా గృహాలు ఉండాలని, విద్య, వైద్య, తాగు నీరు, మౌలిక వసతులు విధిగా ఉండాలని ఆయన అన్నారు. ఆయా గ్రామాల్లో అవసరాలు గుర్తించాలని ఆయన ఆదేశించారు. ప్రధాన మంత్రి జన్ మాన్ కార్యక్రమం క్రింద పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రతి సభ ఫలవంతం కావాలని ఆయన చెప్పారు. గ్రామస్తుల అవసరాలు గుర్తించాలని ఆయన సూచించారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, ఆరోగ్య కార్డులు జారీ తదితర ప్రయోజనాలు ప్రతి అర్హుడికి అందాలని ఆయన ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.ఈసమావేశంలో పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వి వెంకట రమణ, పార్వతీపురం ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఏ మురళీధర్, పార్వతీపురం, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు కె శ్రీనివాస్, ఎస్ సర్వేశ్వర రావు, మలేరియా నివారణ కార్యక్రమం కన్సల్టెంట్ రామ చంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సూపర్ సిక్స్ 'పథకాలు తక్షణమే అమలు చేయాలి'

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సి.పి.యం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన.సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రామవరంలో జరిగిన ఆ పార్టీ ఆగ్జలరి సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులలో ముఖ్య అతిదులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సుత్తీకొడవలి నక్షత్రం గుర్తు కలిగిన సి.పి.యం పార్టీ జెండాను మండల యం.పి.పి కారం.లక్ష్మి ఆవిష్కరించారు.అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం వి.అర్.పురం చింతూరు మండలాలకు సంబంధించిన200 మంది నూతన పార్టీ సభ్యులను ఉద్దేశించి మంతెన.సీతారాం మాట్లాడారు. 77 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ప్రజల అభివృద్ధి జరగటం కన్నా భూస్వాములు, భుర్జువాలు, పెట్టుబడిదారులు కార్పొరేట్లు అభివృద్ధి చెందారని, 99% ప్రజలలో ఉండాల్సిన దేశ సంపద 1% ప్రజల దగ్గర పోగుబడిందని ఆయన అన్నారు.ప్రజలకు అవసరమైన భూ సంపదనంతా ప్రభుత్వాలు కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయి అని భూ సంపద ప్రజల పరం అయినప్పుడే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం కొరకు ఎన్నికల్లో అనేక హామీలు ఇస్తున్నారు ఆ హామీలను అమలు చేయటంలో చిత్తశుద్ధి లేదని తక్షణమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా ఉద్యమాల సెగ ప్రభుత్వానికి తప్పదని అన్నారు. ఈ దేశ స్వాతంత్ర్యం కొరకు అనేక మంది యువ కిశోరాలు భగత్ సింగ్ లాంటి వారు ప్రాణ త్యాగం చేశారని, ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడి ఈ దేశ అభివృద్ధి కొరకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పూనేం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం.చినబాబు, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్ పార్టీ నాయకులు పులి సంతోష్ కుమార్, కారం.సుందరయ్య, పొడియం.లక్ష్మణ్, పులి బొజ్జి, బాలరాజు, వర్లాధి.రమేష్, కంజ.నాగిరెడ్డి, కారం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యార్థిని మృతి

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు మండలం కుమ్మూరు గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని, చింతూరు కస్తూరిబా పాఠశాలలో ఏడవ తరగతి చదువుతుంది. ఆమె అత్త కూతురు అయిన మరో విద్యార్థిని పార్వతి తల్లికి శనివారం సాయంత్రం ఫోన్ ద్వారా సమాచారం అందజేసింది. సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లి, రాములమ్మ ఆదివారం ఉదయం కస్తూరిబా పాఠశాలకు చేరుకుని, తమ కుమార్తెను తనతో పాటు పంపించాల్సిందిగా కోరింది. ఇంచార్జ్ అంగీకరించలేదు. ఆమె వారించటంతో చివరకు పంపించారు. తన కుమార్తెను నేరుగా చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లిన తల్లి, డాక్టర్లకు చూపించింది. ఆయాసం వస్తుందని పరిస్థితి బాగాలేదని, విషమంగా ఉందని భద్రాచలం తరలించాలని సూచించారు. అందుకు సిద్ధంగాలేని తల్లి తన స్వగ్రామానికి వెళ్లి, విద్యార్థిని తీసుకుని సాయంత్రం మరోసారి చింతూరు ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన డాక్టర్లు రాత్రి సమయంలో 108 వాహనంలో భద్రాచలం తరలించారు. సోమవారం ఉదయం పరీక్షలు చెప్పిన డాక్టర్లు ఆమెను ఐసీయూలో పెట్టగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతదేహాన్ని మామిళ్ళ గూడెంలోని వారి స్వగ్రామానికి, తరలించారు. బీజేపీ నాయకులు చిట్టిబాబు, జనసేన నాయకులు మడివి నెహ్రూ మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జమాల్‌ఖాన్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం : కస్తూరిబా గాంధీ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న శ్యామల లక్ష్మీపార్వతి (12)అనే విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ద్వారా రు 5 వేల నగుదును అందజేయడం జరిగింది. పాఠశాలలో పిల్లలు ఏవిధంగా ఉంటున్నారో వారి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తరచూ తల్లిదండ్రులు పర్యవేక్షిస్తూ ఉండాలని ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది వారి ఆరోగ్యం పట్ల పరీక్షలు నిర్వహిస్తూ వారిని ఎప్పటికప్పుడు ఆరోగ్యం పై దృష్టి ఉంచాలని అనారోగ్యం వాటిల్లి వ్యాధి ముదిరి చివరకు ప్రాణాంతకం మారేదాకా అలసత్వం వహించవద్దని ఈ సందర్భంగా జమాల్ ఖాన్ సూచించారు.

అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి : ఎంపీపీ

విశాలాంధ్ర-గంగవరం : అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయనిమండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి, జడ్పీటిసి బేబీ రత్నం అన్నారు. మంగళవారం ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి మరియు డివిజన్ స్థాయి అవార్డులు పొందిన అధికారులకు, ఉద్యోగులకు పిడత మామిడి శివాలయంలో సర్పంచ్ మరిడమ్మ, డి సి సి బి మాజీ డైరెక్టర్ ఎజ్జు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కష్టపడి విధులు నిర్వహించిన ఉద్యోగులను సన్మానించడం అభినందనీయమని తహశీల్దార్, సి.హెచ్. శ్రీనివాసరావు అన్నారు. ఈ సంధర్భముగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులకు తగిన సహాయ సహకారాలు అందిస్తే మండలం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎంపిపి కృష్ణ రెడ్డి మాట్లాడుతూ మండలంలో అధికారులు, ఉద్యోగులు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారని. అందుకే మండలంలో ఎక్కువ మందికి అవార్డులు దక్కాయి అన్నారు. జెడ్పీటిసి బేబీ రత్నం మాట్లాడుతూ ఈ సంవత్సరం స్వతంత్ర దినోత్సవ వేడుకలలో మండల ఉద్యోగులకు, అధికారులకు అవార్డుల దక్కించుకోవడంగర్వకారణం అన్నారు. ఈ అభినందన సన్మాన కార్యక్రమంను ఘనంగా నిర్వహించిన యెజ్జు వెంకటేశ్వరరావు పిడతమామిడి సర్పంచ్ మరిడమ్మలను అభినందించారు.

ఈ సందర్భముగా జిల్లా అవార్డులు అందుకున్న డిటి, వీరభద్రరావు, ఆర్ఎ, జిలానీ, కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, ఎంఈఓ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, పిడతమామిడి పంచాయితీ కార్యదర్శి వెంకట సురేష్, డివిజన్ స్థాయి అవార్డులు అందుకున్న శివ గణేష్, రామాయమ్మ, రాజ్యలక్ష్మి తదితరులను దూశాలువలతోనూ సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. వైస్.ఎంపిపి లు రామతులసి, గంగాదేవి, ఎంపిటిసి కనకలక్ష్మి, సర్పంచ్‌లు పార్వతి, కె. లక్ష్మి తదితరులు వారి ప్రసంగాలలో సన్మాన గ్రహీతల సేవలను కొనియాడారు. రీ సర్వే డిటి, రాంబాబు బయ్యనపల్లి దొర మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ రమణారెడ్డి, పాఠశాల చైర్మెన్ లోత లక్ష్మి, వైస్ చైర్మన్ గెద్దం రమణ వార్డు మెంబర్లు చిట్టిబాబు, కనకలక్ష్మి, గ్రామ పెద్దలు తాతాజీ, రామకృష్ణ పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

29 మెగా ఉచిత దంత వైద్యం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా పింఛనుదారుల సంఘ సౌజన్యంతో వరుణ్ డెంటల్ వారు గురువారం మెగా దంత వైద్యం ఇహెచ్ఎస్ కార్డుపై ఉచితంగా వైద్యం అందించనున్నారని పార్వతీపురం మన్యం జిల్లా పింఛనుదారుల సంఘ కార్యదర్శి దొడ్లంకి గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్థానిక రైతు బజారు సమీపంలో ఉన్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈనెల 29వ తేదీ గురువారం ఉదయం 9.గం. నుండి మధ్యాహ్నం 1గం. వరకు ఉచిత దంత వైద్యం అందించ బడునని, దీనికి ఆర్టీసీ, ఎపిఈపిడిసిఎల్, జర్నలిస్టులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పింఛనుదారులు అర్హులని, ఇహెచ్ఎస్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. తెల్పినవారంతా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.

చిన్న జడమూరులో వైద్య శిబిరం

విశాలాంధ్ర-జీకే విధి : పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల చిన్న జడమూరు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. గ్రామంలో ఉన్న 15 మంది జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగిందనీ వైద్యశాఖ అధికారులు చెప్పారు. మలేరియా ఎవరికి నమోదు కాలేదునీ, 50 మంది ఓ.పి చిరు వ్యాధులకు చికిత్స అందించడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు మంచినీరు కాచి చల్లార్చిన నీరు త్రాగాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్, పి. కోమలి ,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, బాలరాజు ఎం పి హెచ్ ఓ అనీషా, ఎమ్ ఎల్ హెచ్ పి మాధవి బంగారమ్మ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలు పంపిణీ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ జాకబ్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు పంచాయతీ కార్యాలయంలో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు అందిస్తున్న పొగరాని పొయ్యిలను పంచాయతీ ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ గరిడే బాబురావు మాట్లాడుతూ మండలంలో సుమారు 90 శాతం గిరిజన ప్రజలకు పొగరాన్ని పొయ్యలను పంపిణీ చేయడం జరిగిందని కేవలం గిరిజన ప్రజలకు మాత్రమే ఈ యొక్క పొగరాని పొయ్యిలను పంపిణీ చేయడం జరుగుతుందని ఆధార్ కార్డు, రేషన్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్ కలిగిన ప్రతి ఒక్కరికి ఈ పొయ్యిలను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కే వీరపరెడ్డి, జి చరణ్, సుర్జిత్ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను చక్కగా నిర్వహించాలి

విశాలాంధ్ర-బలిజిపేట : బలిజిపేట మండలం లోగల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను చక్కగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం కోరారు. మంగళవారం ఎంఈవో కార్యాలయంలో మండల స్థాయి పరీక్ష పత్రాల పంపిణీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్ష పత్రాలను, ఓఎంఆర్ షీట్స్ ను ఆయా స్కూల్ కాంప్లెక్స్ వారీగా సిఆర్ఎంటిల ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని టీచర్లు ప్రశ్న పత్రాలను తీసుకువెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రశ్నా పత్రాలు లీక్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో హెచ్ఎం లదే పూర్తి బాధ్యత అని, ఏమాత్రం పొరపాటు జరిగినా కఠిన చర్యలు ఉంటాయని ఎంఈవో స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చిలకలపల్లి హెచ్ ఎం మజ్జి గౌరీశంకరరావు, సీఆర్ఎంటీ లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని స్థానిక దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హైవే రోడ్డు మూడు రోజుల జంక్షన్ మీదుగా బిఎస్ఎన్ఎల్ టవర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్రదానం చాలా విలువైనదని, నేత్రదానం చేయడం వల్ల అందత్వం గలవారికి చూపును ప్రసాదించవచ్చని చెప్పారు. ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ అయి బ్రెయిన్ డెడ్ అయిన వారి కల్లును దానం చేయడం వల్ల చూపులేని మరొకరికి వెలుగును ప్రసాదించడం జరుగుతుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మానవత్వంగా నేత్ర దానం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ సౌరి, హెల్త్ అసిస్టెంట్ దామోదర్ వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాలి

వ్యవసాయ అధికారి ప్రశాంతి

విశాలాంధ్ర-దేవీపట్నం : రైతులు అందరు పంట నమోదు చేసుకోవాల్సిందిగా దేవిపట్నం వ్యవసాయ శాఖ అధికారి ఆర్. ప్రశాంతి తెలిపారు. ప్రతి రైతు సేవ కేంద్రం లోనూ విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పంట నమోదు చేస్తున్నారు. రైతులు అందరూ తాము నాటిన ప్రతి పంటను పంట నమోదు చేయుంచుట వలన వారు పంట కి సంబందించిన సబ్సిడిలు లేదా పంటకి ఏమైనా విపత్తులు ద్వారా నష్టం సంభవించిన నష్ట పరిహారం మొదలైన వాటికి అర్హులు అవుతారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతులు 2100 ఎకరాలకి మాత్రమే పంట నమోదు చేసుకున్నారని, సెప్టెంబర్ 15వ తారీకు లోపు పంట నమోదు చేయించు కోవాలని తెలిపారు. ఇందుకూరుపేట లో పంట నమోదు ను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ రత్నాకుమర్, విలేజ్ అగ్రికల్చర్ మరియు హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు టెంట్, టార్పాలిన్ వితరణ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల నందు 2000-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులను గమనించి చైర్మన్ ముత్యాల శంకర్రావు ఉప చైర్మన్ బేతం వినోదినీ లక్ష్మి సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిచ్చడి బాబూరావుకు మంగళవారంటెంట్, టార్పాలిన్ వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల 2000-2001 బ్యాచ్ సభ్యులు బొర్రా సరేష్ కుమార్ మాట్లాడుతూ ఈనాటి బాలలే రేపటి పౌరులని, భావితరాల భవిష్యత్తుకు బాటలు వేస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన ఆగస్టు 15 రోజున ,ప్రతిరోజు ప్రార్థన సమయంలో విద్యార్థులు సూర్యరశ్మిలో నుంచున్నప్పుడు మధ్యాహ్నం భోజనం సమయంలో వరుస క్రమంలో ఉంటున్నప్పుడు సూర్యుని వేడికి అవస్థ పడుతున్నారని గమనించి తోటి మిత్రులకు తెలియపరచి మనము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని మనసు చెలించి వారందరి సహకారంతో పాఠశాలకు తమవంతు సహకారంగా టెంట్ టార్పల్లిన్ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బొర్రా సూరి, కోట్ల అప్పాజీ, ముంజపు వరప్రసాద్, ముత్యాల సిద్దు, బొర్రా ఆదినారాయణ, ముత్యాల శేఖర్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్లు వేగవంతం చేయండి : జేసి డా. అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లాలో మ్యుటేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని, పెండింగ్ పెండింగ్‌లో ఉన్న ఆర్ఓఆర్, ఎల్ టి ఆర్, ఎల్ఎ, ఆర్ అండ్ ఆర్ కేసుల పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డా.ఎంజే అభిషేక్ తహసిల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, సబ్ కలెక్టర్లు, తహసిల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జేసి మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కు అందిన ఫిర్యాదులు సకాలంలో నాణ్యవంతంగా పరిష్కరించి ఫిర్యాదుదారుకు తెలియజేయాలని, తిరస్కరిస్తే కారణాలు తెలియజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్ఎల్ఎ గడువులోగా పరిష్కరించాలని, ఎత్తి పరిస్థితులలో బిహైండ్ ఎస్ఎల్ఎ లేకుండా చూడాలని స్పష్టం చేసారు. భూసేకరణకు సంబంధించి అవార్డుల ప్రదానానికి చర్యలు తీసుకోవాలని, సివిల్ డిపాజిట్స్ పరిష్కారం చేయాలని సూచించారు. వెబ్ ల్యాండ్‌లో తప్పులు సవరించాలన్నారు. ప్రతి మంగళవారం సమీక్ష ఉంటుందని, ముందుగానే పూర్తి వివరాలు సమర్పించడంతో పాటు సమీక్షలలో వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఆలస్యపు జనన మరణ ధృవపత్రాల జారీపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కేస్ట్, ఇన్కం సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉద్యాన మొక్కలు పంపిణీ, మొక్కలు నాతడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం క్రింద పనులు కేటాయించాలని, వంద రోజుల పని దినాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసే దిశగా అన్ని ప్యాక్స్ ను కంప్యూటరీకరణ గావించాలని ఆదేశించారు. డిసిసిబి, కో-అపరేటివ్ సొసైటీలతో సంప్రదించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ బి. పద్మావతి, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా మారిన రహదారులు.... ఆటోకి తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-కొమరాడ : మండలంలోని అధ్వానంగా మారిన అంతరాష్ట్ర రహదారిపై వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. మంగళవారం విశాఖపట్నం నుండి రాయగడ వెళ్తుండగా చోళ్లపదం సమీపంలో గల అంతర్ ష్ట రహదారిపై ఉన్న గోతులు వద్ద ఆటోబోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ఆటోలోబోర్డులు తీసుకెళ్తున్న అదేఆటోలో మండలానికి చెందిన పలువురు మహిళలు కూనేరు బ్యాంక్ వెళ్లేందుకు కొమరాడలో ఆటో ఎక్కారు. చోళ్ల పదం సమీపంలో గల భారీ గోతులు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పలువురు మహిళలతో పాటు ఆటోలో సామాగ్రి తీసుకు వెళ్తున్న యాజమాన్యం కూడా కాలు పై గాయం అయింది. విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని బోల్తాపడిన ఆటోను లేపి పక్కకు నెట్టారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా ఇద్దరికీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్వల్ప గాయాలు అయ్యాయి.మండలంలోని పలు ప్రాంతాల్లో అధ్వానంగా మారిన గోతులు వద్ద వాహనాలు బోల్తాపడడంతో ప్రమాదాల జరుగుతున్నాయని తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి రోడ్డుల మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ప్రజలు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

పరిపాలనాధికారుల అవగాహనలేమి వల్లనే ఆసుపత్రిలో వరుస సంఘటనలు

జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : అవగాహన, అనుభవం లేని ఆసుపత్రి పరిపాలన అధికారుల (సూపరిండెండెంట్) వలననే స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా యని స్థానిక జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం ఆసుపత్రిలో చోటు చేసుకున్న షార్ట్ సర్క్యూట్ అయి స్థానిక విద్యుత్ సహాయకుడు గుల్లెల లక్ష్మణరావు గాయపడిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా షార్ట్ సర్క్యూట్ అయిన ప్రాంతాన్ని పరిశీలించారు. వార్డులలో తిరిగి రోగులు, బాలింతలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతితో ఆసుపత్రి పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా విధంగా ఈ మధ్యకాలంలో ఆసుపత్రిలో వరుస సంఘటనలు జరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. షార్ట్ సర్క్యూట్ లో గాయపడిన విద్యుత్తు సహాయకుడు లక్ష్మణ్ రావు కు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రి పరిపాలన అధికారులు(సూపరింటెండెంట్ గా) అవగాహన, అనుభవం లేని కారణంగా ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. కరోనా సంక్షోభ సమయంలోనూ ఇద్దరు వైద్యులే ఉన్నప్పటికీ తలత్తని సమస్యలు నేడు పదిమంది వైద్యులు ఉన్నప్పటికీ పరిష్కారానికి నోచుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. నిపుణులైన వైద్యులను నియమిస్తున్నప్పటికీ ఆసుపత్రి పరిపాలన అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది మధ్య సమన్వయ లోపం కారణంగా రోగులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని, సమన్వయ లోపం కారణంగానే వైద్యాధికారి రాజీనామా చేసినట్లు, కొంతమంది సిబ్బంది విధుల నిర్వహణలోనూ సూపరిండెండెంట్ వివక్ష చూపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి సమస్యలను పాడేరు ఐటిడిఏ పిఓ, జిల్లా కలెక్టర్ ల దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు, ఆసుపత్రిలో నిపుణులైన గైనిక్, మత్తు, శస్త్ర చికిత్సలు చేసే వైద్యాధికారులను నియమించాలని కోరుతాసన్నారు. వైకాపా ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముందుచూపుతో 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా పెంచడంతోపాటు, వంద పడకల ఆసుపత్రి భవనాలు నిర్మాణ దశలో ఉన్నప్పటికీ, 30 పడకల ఆసుపత్రిలోనే ప్రస్తుతానికి100 పడకల వైద్య సిబ్బందిని, వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకు వచ్చినప్పటికీ పరిపాలన అధికారుల నిర్లక్ష్య వైఖరి వలన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఆయన ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల కారణంగానే అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు అన్న చందంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చింతపల్లి, జీ కే వీధి మండలాలలో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటన్నింటికీ పెద్దదిక్కుగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ఉన్నప్పటికీ చిన్నపాటి వైద్య సమస్యకు కూడా రోగులు, గర్భిణీలు, బాలింతలను మైదాన ప్రాంతాలకు తరలించడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి పరిస్థితులలో పుండు మీద కారం చల్లినట్లు ఆసుపత్రిలో విద్యుత్ సమస్యలు తలెత్తడం దానివలన విద్యుత్ సహాయకుడు తీవ్రంగా గాయపడటంతో పాటు ఆసుపత్రి మొత్తం పొగ కమ్ముకోవడంతో బాలింతలు, రోగులు భయభ్రాంతులు కావడం చర్చనీయాంశంగా మారిందన్నారు. ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత సంబంధిత శాఖ ఉన్నతాధికారులపై ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్రక్రమంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాదు, పార్టీ నాయకులు నరేష్, అశోక్ కుమార్ లు పాల్గొన్నారు.

జిల్లా నిఘా కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జనార్ధనరావు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జిల్లా నిఘా కమిటి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక స0క్షేమ అధికారి జి. జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఎఎస్ దినేష్ కుమార్ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల ఉపాధిని నిషేధించిన నేపథ్యంలో స్కావెంజర్ల పునరావాస చట్టం, 2013 (సఫాయి కర్మాచారి) అమలులో భాగంగా జిల్లా నిఘా కమిటి ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా నిఘా కమిటీలో ఒక మహిళా సభ్యురాలితో పాటు నలుగురు సభ్యులను నియామకము చేయడం జరుగుతుందని తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలలోని కార్యకర్తలు లేదా జిల్లాలో నివసించే స్కావెంజర్స్ (సఫాయి కర్మాచారి) కమ్యూనిటీ కోసం ప్రాతినిధ్యం వహిస్తూన్న వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఈ నలుగురులో ఒక్క మహిళ సభ్యులు ఉండాలన్నారు. జిల్లా నిఘా కమిటి నందు సభ్యులుగా దరఖాస్తు చేసుకొను వారు అల్లూరి సీతారామ రాజు జిల్లా వాసులు అయివుండవలెనని సంబందిత ఆధారాలు (ఫోటోలు/పత్రములతో సహా)తో వారి పూర్తి బయోడేటా జతపరచి జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి వారు కార్యాలయము, జూనియర్ కాలేజీ గ్రౌండ్, పాడేరు వారికి సెప్టెంబర్ రెండవ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, పూర్తి వివరాలకు 70364 08143 నంబర్లో సంప్రదించాలని కోరారు.